# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం : 27 : జూలై : 2025






### యథేచ్ఛగా వేట..
ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా అటవీప్రాంతంలో వేటగాళ్ల తీరు మారడంలేదు. వన్య ప్రాణుల వధ ఆగడంలేదు.
8లో



### కిన్నెరసానికి వరద..
కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్ట్‌ల్లోకి వరద ఉధృతి కొనసాగుతోంది.
8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

### వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం అక్కడక్కడా జల్లులు పడవచ్చు. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## న్యూస్‌రీల్

### రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



రామయ్యకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

### ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండాలి



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్, సుదిమళ్ల గ్రామ పంచాయతీల్లో ఓటరు మెర్జింగ్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కుటుంబంలోని సభ్యులు ఒకే వార్డులో ఉండేలా మెర్జింగ్ ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ
నేడు 380 మందికి పరీక్షలు



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

చుంచుపల్లి: లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించేందుకు ప్రభుత్వం చేపట్టిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. గత మే 26 నుంచి కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో 380 మందికి 50 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఆదివారం సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రాత పరీక్షలు, ఈ నెల 28, 29వ తేదీల్లో ఫీల్డ్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే అభ్యర్థులకు సర్వేయర్ లైసెన్స్ ఇవ్వనున్నారు. కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం, భూముల అమ్మకాలు, కొనుగోళ్లలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేయడం వంటి చర్యల నేపథ్యంలో ప్రభుత్వం పలువురు అభ్యర్థులను ఎంపిక చేసి సర్వేయర్లుగా శిక్షణ ఇచ్చింది.

### ఆరోగ్య శ్రీ ద్వారా ఈఎన్‌టీ శస్త్రచికిత్స



పేషెంట్‌తో డాక్టర్, నర్సింగ్ సిబ్బంది

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో శనివారం ఆరోగ్య శ్రీ పథకంలో ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిర్వహించారు. పట్టణంలోని రైటర్ బస్తీకి చెందిన 17 ఏళ్ల ఖ్యాతికి ముక్కులో కండరం పెరగడంతో శ్వాస సమస్య ఎదురైంది. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా సుమారు రూ.40 వేలు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు సునీత-జయబాబు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా ఈఎన్‌టీ డాక్టర్ రవి తేజస్వీ వైద్య పరీక్షలు నిర్వహించింది. శనివారం డాక్టర్ రవి తేజస్వీ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫర్జానా, నర్సింగ్ సిబ్బంది భారతి, లలిత రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేశారు. ముక్కు దూలం వంకర సరిచేయటంతో ముక్కులో పెరిగిన కండరాన్ని తొలగించారు.

# భవితకు బాటలు..

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం సమ్మిళిత విద్య భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో 30 కేంద్రాలు ఉండగా, వీటిల్లో విద్యాభ్యాసంతోపాటు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. పరికరాలు, అలవెన్స్‌లు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల కొత్తగూడెం వచ్చిన రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణా జిల్లా కేంద్రం రైటర్‌బస్తీలోని భవిత కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న సేవలు, విద్యాభ్యాసంపై ఆరా తీశారు. సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. – కొత్తగూడెంఅర్బన్



దమ్మపేట: విద్యార్థికి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న భవిత కేంద్రం నిర్వాహకులు

**భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, విద్యాభ్యాసం..**
- ప్రత్యేకావసరాలు కలిగిన చిన్నారులకు సేవలు
- ఏడాదికోసారి పరికరాలు అందజేస్తున్న ప్రభుత్వం
- కొత్త భవనాలు, మరమ్మతులకు రూ.1.38 కోట్లు మంజూరు



భవిత కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా(ఫైల్)

**ఫిజియోథెరపీతో సత్ఫలితాలు**

జిల్లాలోని 30 భవిత కేంద్రాల్లో 36 మంది ఐఈఆర్‌పీలు పనిచేస్తుండగా, ఇంకా పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతీ కేంద్రంలో ఆయా ఒకరు ఉన్నారు. 21 రకాల వైకల్యం కలిగిన పిల్లలు జిల్లావ్యాప్తంగా 2,231మంది ఉన్నారు. వీరిలో 1,925 మంది వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. భవిత కేంద్రాల్లో 306 మంది విద్యాభ్యాసం చేస్తుండగా, బడి బయట 45 మంది పిల్లలు ఉన్నారు. హోం బేస్డ్ ఎడ్యుకేషన్‌లో ప్రతీ శనివారం ఐఈఆర్‌పీలు 144 మంది పిల్లల ఇళ్లకు వెళ్లి కృత్యాధార బోధన చేస్తున్నారు. భవిత కేంద్రాల్లో మెరుగుపడ్డ పిల్లలను సాధారణ పాఠశాలల్లో చేర్చుతున్నారు. మండల కేంద్రాల్లో 9మంది ఫిజియోథెరపిస్టులు వారానికి రెండు రోజుల చొప్పున క్యాంపులను నిర్వహిస్తూ 148 మంది దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. మంచం మీద కదలలేని స్థితిలో ఉన్న పిల్లలు సైతం ఫిజియోథెరపీ సేవలు పొందాక నిలబడగలుగుతున్నారు. కొందరు నడవగలుగుతున్నారు కూడా.

**ప్రతీ విద్యార్థికి అలవెన్స్**

అర్హత కలిగిన దివ్యాంగ విద్యార్థులకు నెలకు రూ.500 ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, రూ.500 ఎస్కార్ట్ అలవెన్స్, రూ.60 రీడర్ అలవెన్స్, ప్రత్యేకంగా బాలికలకు రూ.200 చొప్పున ఉపకార వేతనాలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 751 మంది పిల్లలకు రూ.23,32,720 అలవెన్స్‌లు, ఉపకార వేతనాలు అందించారు. 387 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, వారిలో 288 మందికి రూ. 25,80,914 విలువైన 348 పరికరాలు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఏటా జనవరి, మే నెలల్లో సర్వే నిర్వహిస్తూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. యూడైస్ వెబ్‌సైట్, ప్రబంధన్ పోర్టల్‌లో కూడా వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారు.

**నూతన భవనాలకు నిధులు..**



రైటర్ బస్తీ కేంద్రంలో నిలిచిన వర్షపునీరు

భవితకేంద్రాలకు కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట ఆరు మండలాల్లో శాశ్వత భవనాలు ఉన్నాయి. మిగిలిన 24 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఇటీవల శాశ్వత భవనాల మరమ్మతులు, పరికరాల ఏర్పాటుతో పాటు 17 నూతన భవనాల నిర్మాణాలకు రూ.1.38కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి,అశ్వాపురం, బూర్గంపాడు,చర్ల, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, దుమ్ముగూడెం, గుండాల, జూలూరుపాడు, కరకగూడెం, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి, పినపాక, సుజాతనగర్, టేకులపల్లి మండలాల్లో కొత్త భవనాలు నిర్మించనున్నారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. వర్షపు నీరు నిలిచి పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఆవరణల్లో పిచ్చిమొక్కలు మొలిచి దోమలు వృద్ధిచెందుతున్నాయి. విద్యాధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని తల్లిదండ్రులు, సహాయకులు కోరుతున్నారు.

**అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం**



జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. అలవెన్స్‌లు సకాలంలో అందజేస్తున్నాం. అవసరమైన పరికరాలను సమకూర్చుతున్నాం. ఫిజియోథెరపీ సేవలు కూడా షెడ్యూల్ ప్రకారం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సైదులు, జిల్లా కో ఆర్డినేటర్

## నేడు రెండు జిల్లాల అధికారులతో మంత్రుల సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమకార్యక్రమాలపై రెండు జిల్లాల అధికారులతోఆదివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోమంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క,ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటిశ్రీహరి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు.

## మేం లేనిదే కాంగ్రెస్ గెలిచిందా?



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, పక్కన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎన్. సత్యం

- తెలంగాణ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసింది కమ్యూనిస్టులే
- కాల్పులు ఆపి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలి
- మోదీ, అమిత్‌షాల ప్రభుత్వానికి కాలంచెల్లే రోజులు వచ్చాయి..
- సీపీఐ జిల్లా మహాసభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

అశ్వారావుపేట: కాంగ్రెస్ పార్టీని గెలిపించింది సీపీఐ పార్టీనేనని, తమ ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి గద్దెనెక్కారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఎమ్మెల్యేను గెలిపించామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులనుద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం అశ్వారావుపేటలో పార్టీ మూడో జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. తొలుత మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ స్థానాల్లో 118 ఈజ్ ఈక్వల్ టూ వన్ అని అన్నారని గుర్తుచేశారు. తాము లేకపోతే కాంగ్రెస్‌కు అధికారమే లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ మినహా ఇతర పార్టీలతో స్థానిక పరిస్థితులను బట్టి పొత్తు పెట్టుకోవచ్చని జిల్లా నాయకులకు సూచించారు. కాంగ్రెస్‌తో కలిసే ఉన్నామని, ఒప్పందం గౌరవంగానే ఉండాలని హితవు పలికారు.

**మావోయిస్టులు మా మిత్రులే..**

మార్చి 2026లోగా మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్ షా అంటున్నారని, లేకుండా చేసేంత తప్పు మావోయిస్టులేం చేశారని ప్రశ్నించారు. చర్చలకు ఆహ్వానించకుండా కాల్పులు జరపడమేంటని ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమ్యూనిస్టుల సిద్ధాంతం ఒకటే అయినా, మార్గాలు వేరు కావడం వల్ల సీపీఐ(ఎం), నక్సలైటు పార్టీలు ఏర్పడ్డాయన్నారు. తెలంగాణ విముక్తి కోసం సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసింది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. మావోయిస్టులతో సహా ఎర్రజెండా పట్టుకున్న ప్రతి ఒక్కరూ తమవాళ్లేనని పేర్కొన్నారు. బలం సంపాదించిన తర్వాతే తుపాకులు పడదామని, అప్పటి వరకు వేచి ఉండాలని మావోయిస్టులకు సూచన చేస్తున్నామని తెలిపారు. కమ్యూనిస్టులు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

**బీజేపీకి చరిత్ర లేదు: ఎమ్మెల్సీ నెల్లికంటి**

బీజేపీకి చరిత్ర లేదని, రాముడు, అయోధ్య పేరుతో గొడవలు సృష్టించి అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు.10 ఏళ్ల పాలనలో మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు. ఢిల్లీలో రైతులు ఆందోళన చేపడితే మోదీ ప్రభుత్వం 800 మందిని పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. బీజేపీకి బలమే లేదని, అయినా తాబేదార్లు చంద్రబాబు, నితీష్ కుమార్‌ల మద్దతులో అధికారంలోకి వచ్చిందని అన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా, సయ్యద్ సలీం, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండు సురేష్ తదితరులు మాట్లాడారు.

### గోదావరికి పెరుగుతున్న వరద



భద్రాచలం వద్ద గోదావరి నదిలో వరద ఉధృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరిలో వరద పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటలకు 26.40 అడుగుల వద్ద ఉన్న నీటి మట్టం శనివారం ఉదయం 6 గంటలకు 31.30 అడుగులకు చేరికుంది. 4,80,270 క్యూసెక్కుల వరద నీరు దిగుకు వెళ్తోంది. ఉదయం 9 గంటలకు 33.60 అడుగులు, మధ్యాహ్నం 12 గంటలకు 34.60 అడుగులు, 2 గంటలకు 34.90 అడుగులకు, రాత్రి 10 గంటలకు 35.40 అడుగులకు చేరుకుంది. గోదావరి వరద నీటిమట్టం 36 అడుగులకు చేరుకున్నాక తిరిగి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## భారీ వర్షాలతో ముందస్తు జాగ్రత్తలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ జితేష్, ఇతర అధికారులు

- సిద్ధంగా రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- ఆగస్టు 15 నాటికి వనమహోత్సవం పూర్తి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన సురేంద్రమోహన్ శనివారం హైదరాబాద్ నుంచి జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, యూరియా నిల్వలు, సీజనల్ వ్యాధులు, రేషన్ కార్డుల మంజూరు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గోదావరిలో ప్రస్తుతం 33అడుగుల వరద ప్రవా హం ఉందని, ముందస్తుగా రెండు ఎన్డీఆర్ఎఫ్‌బృం దాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు చెందిన 100 మంది కానిస్టేబుళ్లకు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఆపదమిత్ర వలంటీర్ల కోసం అగ్నిమాపక శాఖ సమన్వయంతో భద్రాచలం, పాల్వంచలలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఏడు బోట్లు, మైకులు, రోప్, టార్చ్‌లైట్లు అందుబాటులో ఉన్నాయని, భద్రాచలం కరకట్టపై సైరన్ ఏర్పాటు చేశామని వివరించారు.

**అందుబాటులో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా**

జిల్లాలో మూడువేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, వర్షం వల్ల ఖమ్మం నుంచి యూరియా రావాల్సి ఉండగా, వర్షం వల్ల ఆలస్యమైందని తెలిపారు. అశ్వారావుపేటలో గుర్తించిన ఐదు యాడ్‌బ్లూ పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి యూరియా అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారికి రేషన్‌కార్డులు వచ్చాయని, ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్లారు.

**7,747 ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్**

జిల్లాలో 13,844 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా, 7,747 ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయిందని తెలిపారు. రిజర్వాయర్ల ద్వారా ఈసారి సీజన్‌లో 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసేందుకు అవకాశం ఉందని వివరించారు. వనమహోత్సవంలో జిల్లాలో 70.65 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 35 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఆగస్టు 15 నాటికి వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో 2,192 పాఠశాలల్లో గుడ్ల సరఫరా కోసం ఈ నెల 28న నోటిఫికేషన్ ఇస్తామని, ఆగస్టు 6న టెండర్లు ఓపెన్ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, సీపీఓ సంజీవరావు, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, డీపీఓ బాబూరావు, డీఎస్ఓ రుక్మిణి, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రవికుమార్, ఈఈ అర్జున్‌రావు పాల్గొన్నారు.

### విద్యార్థులతో మమేకం కావాలి

పాల్వంచ: విద్యార్థులతో మమేకం కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం ఆయన తెలంగాణా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వసతిగృహాలు, భోజనంగది, మరుగుదొడ్లు, మంచి నీటివసతి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారితో కలిసి భోజనం చేశారు. 'బెస్ట్అవుట్ ఆఫ్ వేస్ట్'కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక వస్తువులను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనశాలలో బెంచీలు, కంప్యూటర్ ల్యాబ్‌లోఐరన్ స్టూల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో రూఫ్‌తో కూడిన టైల్స్ రోడ్ నిర్మిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ మైథిలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక వ్యక్తులపై నిఘా పెట్టాలి

ఎస్పీ రోహిత్‌రాజు



టూ టౌన్ స్టేషన్ ఆవరణలో పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, సమస్యాత్మక వ్యక్తులపై నిఘా పెట్టాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం రామవరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆవరణను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సీఐ ప్రతాప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన దుమ్ముగూడెం సీఐ బి.అశోక్‌ను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. అశోక్ శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛంఅందించగా, ఆయన అభినందనలు తెలిపారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల పరిసరాలు, వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన నిఘాకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీలు, కమ్యూనిటీల్లోకి ప్రవేశించే డెలివరీ బాయ్స్‌ను వివరాలు సేకరించాకే అనుమతించాలని తెలిపారు. ఇంటి యజమానులు అద్దెకు ఉంటున్నవారి పూర్తి వివరాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతాయని వివరించారు.

**విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి**

సుజాతనగర్: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఓఎస్‌డీ గోపతి నరేందర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఠాణా పరిసరాలను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం.రమాదేవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- ఇందిరమ్మ ఇళ్లపై జీపీ కార్యదర్శుల నిర్లక్ష్యం తగదు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- దిశ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, పక్కన కలెక్టర్ జితేష్

చుంచుపల్లి: అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. శనివారం ఐడీఓసీలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దిశ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పనుల పురోగతిపై అన్ని శాఖల అధికారులతో తొలుత సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చేసిన ప్రతిపాదనలకు సంబంధించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తగిన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పీహెచ్‌సీలో అవసరమైన సిబ్బందిని నియమించాలని, పట్వారిగూడెం పీహెచ్‌సీకి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గుండాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేయగా.. పనులు పూర్తి చేయడంలో విఫలమైన కాంట్రాక్టర్లను గుర్తించి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ, పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రేషన్ షాపుల్లో వేలిముద్రలు పడకపోతే రేషన్ కార్డుకు సెల్ నంబర్ అనుసంధానం చేసి, బియ్యం పంపిణీ చేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఉపాధి హామీ పథకం, ఇంజనీరింగ్ తదితర శాఖల ద్వారా చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు మట్టి ఇటుకలు వినియోగించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్ , ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన పాల్గొన్నారు.

**క్రీడా పరికరాల పంపిణీ**

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా క్రీడల, యువజన శాఖ ఆధ్వర్యంలో రూ. 50 లక్షల విలువైన క్రీడా పరికరాలను శనివారం కలెక్టరేట్‌లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, కబడ్డీ, సైక్లింగ్, రెజ్లింగ్, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, కరాటే, తైక్వాండో తదితర క్రీడల అసోసియేషన్లకు పరికరాలను అందజేశారు. రైఫిల్ షూటింగ్ కోచ్ అబ్దుల్ నబీ, జిల్లా క్రీడల, యువజన శాఖాధికారి ఎం.పరంధామరెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్

**కొత్తగూడెంఅర్బన్:** పాఠశాలల్లో ఉన్న గ్రంథాలయాలను సమర్థవంతంగా వినియోగించడం వల్ల పిల్లల్లో ఆశించిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించవచ్చని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో శనివారం కాంప్లెక్స్ స్థాయి రిసోర్స్ పర్సన్లకు 'పాఠశాలల్లో గ్రంథాలయాల నిర్వహణ, సమర్థవంతమైన వినియోగం'అనే అంశంపై ఒకరోజు శిక్షణా నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు గ్రంథాలయాలు ముఖ్యమైన వనరు అని, వీటిని సమర్థవంతంగా వినియోగిస్తే బహుళ తరగతి బోధన సులభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్పీలుగా ఎస్.రాజశేఖర్, వి.రవి కుమార్ వ్యవహరించగా జిల్లాలోని 90 కాంప్లెక్స్‌ల నుంచి 180 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గర్భం దాల్చిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

**దుమ్ముగూడెం:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతి గర్భం దాల్చిన ఘటనపై ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని యువతి 7 నెలల గర్భవతి అనే విషయం ఆలస్యంగా బయటకు వచ్చిన విషయం తెలిసిందే. కాగా ఆ ఘటనకు సంబంధించి కారుకులను గుర్తించాలని ఫిర్యాదులో సీడీపీఓ కోరారు.

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.17,463 |

# యథేచ్ఛగా వేట..

- వన్యప్రాణులకు రక్షణ కరువు..
- తీరు మార్చుకోని వేటగాళ్లు
- అటవీ అధికారుల పర్యవేక్షణపై ఆరోపణలు



నాటుతుపాకీతో సహా వేటగాళ్ల అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

**ములకలపల్లి:** ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా వేటగాళ్లు తమ తీరును మార్చుకోవడం లేదు. యథేచ్ఛగా వన్యప్రాణుల వేట సాగుతూనే ఉందనే ప్రచారం జరుగుతోంది.

నాటుతుపాకీలు, విద్యుత్ షాక్‌లు, వైర్లతో ఏర్పాటు చేసిన ఉచ్చులతో అటవి జంతువులను కర్కషంగా వేటాడి, వాటి మాంసాన్ని బయటకు తరలిస్తున్నారని సమాచారం. ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చిన సమయంలోనే అధి కారులు హడావుడి చేయడం.. కొద్ది రోజులు గస్తీకాయడం.. తర్వాత షరా మామూలే అన్న ఆరోప ణలు వినిపిస్తున్నాయి. వేటగాళ్లకు పోడు భూములు ఉన్నప్రాంతాలు అనుకూలంగా మారాయి. పోడు భూముల్లో నుంచి స్వేచ్ఛగా అడవిలోకి ప్రవేశించడం.. వన్యప్రాణాలను వేటాడి.. తిరిగి ఈ భూ ముల ద్వారానే బయటకు తరలిస్తున్నట్లు తెలిసింది. నిత్యం అడవిలో తమ బీట్లలో పర్యవేక్షించాల్సిన సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే వేట యథేచ్ఛగా కొనసాగడానికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలాండగా కిందిస్థాయి సిబ్బంది సహకారం కూడా ఈ దందా సాగేందుకు కారణమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

**రెండు నెలల్లో రెండు ఘటనలు**

మండల కేంద్రం నుంచి ఎటువైపు చూసినా, సుమారు 20 కిలోమీటర్ల మేర అడవి విస్తరించి ఉంది. ములకలపల్లి, పాల్వంచ, రామవరం రేంజ్‌ల పరిధిలో ఈ అడవి విస్తరించి ఉంది. ఈ అడవిలో వన్యప్రాణులు అధికంగానే ఉన్నాయి. దీంతో వేటగాళ్లు ఈ ప్రాంతాన్ని అనువుగా భావించి, వేటకు తెగబడుతున్నారు. ఇటీవల వరుస ఘటనలు ఈ అంశాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. జూన్ 14న చాపరాలపల్లి వెస్ట్‌బీట్‌లో వేటకు వెళ్లి వస్తున్న వేటగాళ్లను అటవీశాఖ సిబ్బంది అదుపులోకి తీసుకున్నా రు. నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఉదంతం మరువక ముందే గురువారం మాధారం సెక్షన్ పరిధిలో కొమ్ముగూ డెం శివారులో అడవిపందిని ఉచ్చులతో హతమార్చి మాసం విక్రయిస్తుంగా, ఫారెస్ట్ అధికారులు దాడి చేశారు. అడవి పంది తలభాగంతోపాటు మాంసం స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు.

**షరా మామూలే..**

ములకలపల్లి మండలంలో ఏటా వేట అంశం ఏదో విధంగా తెరపైకి రావడం షరా మామూలుగా మా రింది. పలు ఘటనల్లో వేటగాళ్లు సైతం మృత్యువా త పడడం, కేసులు నమోదు కావడం జరుగుతు న్నా, ఎలాంటి మార్పులు చోటు చేసుకోకపోవడం గమనార్హం. ఆ నాలుగు రోజులు హడావుడి చేస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదనేది బహిరంగ రహస్యమే. గత ఏడాది అక్టోబర్‌లో మాధారం అటవీ ప్రాంతంలో కరెంట్ స్తంభాలకు అనుసంధానంగా వైర్లు ఏర్పాటు చేయగా, 8వ తేదీన 'విద్యుత్ తీగలతో వవన్యప్రాణుల వేట' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అటవీశాఖ అధికారులు తీగలను, వాటిని వినియోగించే కర్రలను స్వాధీనం చేసుకున్నారు.

**పలువురి మృత్యువాత**

- 2023 మే 1న దమ్మపేట మండలం రాచూరిపల్లికి చెందిన సవలం నాగరాజు (28), తన మిత్రు డు నాగేంద్రతో కలిసి పూసుగూడెం శివారు అల్లిగూడెం అడవికి వేటకు వచ్చాడు. తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా స్వగ్రామానికి తరలించగా, సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.
- 2022 ఫిబ్రవరి 24న సుందర్‌నగర్‌కు చెందిన సున్నం భద్రయ్య (75) ఊరికి వెళ్లి, తిరిగి వస్తుండగా, గ్రామ శివారులోని మొక్కజొన్న తోటలో అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- 2021 సెప్టెంబర్ 13న మొగరాల గుప్ప గ్రామా నికి చెందిన పాయం జాన్‌బాబు (26), కురం దర్గారావు (35) మాధారం అటవీ ప్రాంతంలో పిట్టల వేటకు వచ్చారు. గుర్తుతెలియని వేటగాళ్లు వన్యమృగాల కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి దుర్గారావు ఘటనాలో స్థలిలోనే మృతి చెందాడు. జాన్‌బాబు ఇంటికి తరలిస్తుండగా మృత్యువాత పడ్డాడు.

### మూతపడిన పాఠశాలలను పునరుద్ధరించండి..



నారాయణరావుపేటలో మూతపడిన స్కూల్లో పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్‌శర్మ

**పాల్వంచరూరల్:** మూత పడిన ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించాలని, సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలను తిరిగి బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్‌శర్మ ఆదేశించారు. మండలంలోని రెండేళ్ల కిందట మూతపడిన నారాయణరావుపేట, బోజ్యాతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. తమ పిల్లలు ఎక్కడ చదువుతున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బోజ్యాతండాలోని మూతపడిన పాఠశాలలో ఓ గదిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డీజే సౌండ్ సిస్టం, డెకరేషన్ సామగ్రి భద్రపర్చడం చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూరల్ ఎస్ఐకి ఫోన్ చేసి, అక్కడికి రప్పించి సామగ్రి తరలించడంతోపాటు సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నాగారం ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌ను పరిశీలించగా రికార్డులన్నీ అస్తవ్యస్తంగా ఉండంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఆయన వెంట ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఎస్‌కే సైదులు, ఎం.సతీశ్ ఉన్నారు.

### కేసు నమోదు

**ఇల్లెందురూరల్:** అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని 21 పిట్ ఏరియాకు చెందిన సౌమ్యకు మణుగూరుకు చెందిన అమ్మిరెడ్డితో ఆరేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో శనివారం సౌమ్య పోలీసులను ఆశ్రయించగా.. ఆమె భర్త అమ్మిరెడ్డిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



### చికిత్స పొందుతున్న మహిళ మృతి

**దుమ్ముగూడెం:** మండలంలోని బట్టిగూడెం గ్రామానికి చెందిన వివాహిత కణితి లలిత పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై శనివారం ఎస్ఐ గణేశ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ కథనం ప్రకారం.. లలితకు చర్ల మండలం బోదినెల్లి గ్రామానికి చెందిన గంగరాజుతో పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కాగా, భర్తతో విభేదాలు రావడంతో రెండేళ్లుగా పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 20న తల్లితండ్రులు, తన సోదరి లలితను భర్త దగ్గరికి వెళ్లాలని మందలించారు. మనస్తాపానికి గురైన లలిత పురుగులమందు తాగింది. తల్లిదండ్రులు భద్రాచలం ఆస్పత్రికి అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. లలిత తండ్రి మల్లం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

# రాష్ట్ర బృందం పరిశీలన



బేతంపూడిలో డంపింగ్ షెడ్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

**టేకులపల్లి:** స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2025 సర్వేలో భాగంగా శనివారం మండలంలోని బేతంపూడి గ్రామపంచాయతీని రాష్ట్ర కో ఆర్డినేటర్ జి.సురేష్, సర్వే టీం సభ్యుడు రవిచంద్ర సందర్శించారు. డంపింగ్ షెడ్, కంపోస్టు ఎరువు తయారీ, తడి, పొడి చెత్తను వేరుచేయడం వంటి అంశాలను పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ ఆఫీస్, ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్ల వినియోగం, ఇళ్లలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై ఆరా తీశారు. సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఎంపీఓజేఎల్ గణేష్ గాంధీ, సిబ్బంది రేవతి, శ్రీనివాస్, రవి, భద్రం పాల్గొన్నారు.



### డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

ఒకరు మృతి

**పాల్వంచరూరల్:** ప్రమాదవశాత్తు డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని బస్వతారకకాలనీ వద్ద శనివారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాధారం గ్రామానికి చెందిన కూరపాటి రాజు (32) పాల్వంచ మండలంలోని బస్వతారకకాలనీ సమీపంలో డేరాలు వేసుకుని నివాసం ఉంటున్నాడు. ఊర్లు తిరుగుతూ గ్యాస్ స్టవ్‌లకు మరమ్మతులు చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం ద్విచక్రవాహనంపై వేగంగా పెద్దమ్మగుడివైపు వెళ్తుండగా సోములగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# కిన్నెరసానికి కొనసాగుతున్న వరద



తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు



కిన్నెరసాని గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**ప్రాజెక్టు రెండు గేట్ల ఎత్తివేత**

**పాల్వంచరూరల్:** కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. నీటి మట్టం గంటగంటకూ పెరుగుతుండడంతో ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని జలాశయంలోకి ఎగువ నుంచి శనివారం 3,600 క్యూసెక్కుల వరద నీరు రావడంతో 404.60 అడుగులకు నీటిమట్టం చేరింది. అధికారులు రాత్రి రెండు గేట్లను ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు.

**తాలిపేరుకూ..**

**చర్ల:** తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. తెలంగాణాతో పాటు ప్రాజెక్టు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. నాలుగు రోజులుగా ప్రాజెక్టు నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రాజెక్టుకు చెందిన ఆరు గేట్లను పూర్తిగా, ఒక గేటును రెండు అడుగుల చొప్పున ఎత్తి 30,119 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 74.00 మీటర్లు కాగా, ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో 72.15 మీటర్లుగా నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నారు. డీఈ తిరుపతి, ఏఈలు ప్రాజెక్టు వద్ద ఉండి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించినట్లు ప్రాజెక్టు ఈఈ సయ్యద్ అహ్మద్‌జానీ తెలిపారు.

# సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

**కార్గిల్ దివస్ వేడుకల్లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్**



అమర జవాన్ల స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, తదితరులు

**ఖమ్మంమయూరిసెంటర్:** సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఫ్రీడమ్ పార్క్‌లో శనివారం చేపట్టిన కార్గిల్ విజయ దివస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ప్రజలంతా ప్రశాంతంగా, అభివృద్ధి పథంలో సాగడానికి సరిహద్దులో కష్టపడుతున్న సైనికులే కారణమని తెలిపారు. దేశ సరిహద్దులో 25 ఏళ్ల క్రితం సైన్యం ప్రాణాలకు తెగించి పోరాడడం ద్వారా కార్గిల్ విజయాన్ని అందించారని చెప్పారు. అనంతరం అమరవీరుల కుటుంబసభ్యులను సన్మానించడమే కాక ఫ్రీడమ్ పార్క్‌లో కలెక్టర్ మొక్కలు నాటారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎం.చంద్రశేఖర్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీసీపీ రామోజీ రమేష్, సురేంద్ర పాల్గొన్నారు.

**రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ**

**సత్తుపల్లి:** నూతన రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులు నిరంతరం సాగుతాయని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సత్తుపల్లి మండలం కొత్తూరు రైతువేదికలో శనివారం రేషన్‌కార్డు మంజూరు పత్రాలను ఆయన ఎమ్మెల్యే రాగమయితో కలిసి అందజేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,200 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, సింగరేణి పీఓ నర్సింహారావు, డీఎస్ఓ చంద్ర కుమార్, దయానంద్, కృష్ణయ్య, చెన్నారావు పాల్గొన్నారు.

### లైంగికదాడికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

**బూర్గంపాడు:** సారపాక సమీపంలోని పల్లెప్రకృతి వనం వద్ద అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున వృద్ధురాలిపై లైంగికదాడికి యత్నించిన ఆటోడ్రైవర్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. బూర్గంపాడు ఎస్ఐ ప్రసాద్ కథ నం ప్రకారం.. భిక్షాటన చేసి జీవిస్తున్న ఓ వృద్ధురాలిని పాల్వంచ నుంచి భద్రాచలం తీసుకెళ్తానని నమ్మించి శుక్రవారం తెల్లవారుజామున ట్రాలీ ఆటోలో ఎక్కించుకుని, సారపాక పల్లెప్రకృతి వనం వద్ద అటవీప్రాంతంలో లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో ఆటోడ్రైవర్ పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినపోలీసులు శనివారం మణుగూరు క్రాస్‌రోడ్ వద్ద వాహ నాల తనిఖీ చేపట్టారు. ఓ ఆటోడ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. వృద్ధురాలిపై లైంగికదాడి యత్నించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు పాల్వంచలోని వెంగళరావునగర్‌కు చెందిన బాదావత్ శంకర్‌గా గుర్తించి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వెల్లడించారు.

### యువతి అదృశ్యం

**ములకలపల్లి:** యువతి కనిపించకుండాపోయిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని చలమన్ననగర్‌కు చెందిన యువతి ఈ నెల 21వ తేదీన కూలీ పని నిమిత్తం వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు ఇరుగు, పొరుగు వారిని, బంధువులను విచారించినా జాడ తెలియలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బైక్ చోరీ

**టేకులపల్లి:** ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. టేకులపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన భూక్య వినోద్‌కుమార్ తన టీఎస్ 26 సీ 1947 నంబర్ గల బైక్‌ని శుక్రవారం రాత్రి ఇంటి ముందు పెట్టాడు. శనివారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

# కోర్టును బురిడీ కొట్టించేందుకే బాబు కుట్ర

## చంద్రబాబు ప్రభుత్వ సరికొత్త కుతంత్రం

### ఈ నేపథ్యంలోనే వికాట్ కంపెనీలో సిట్ సోదాల డ్రామా

**సాక్షి, అమరావతి:** చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ కుట్రలతో మరింతగా రెచ్చిపోతోంది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు అక్రమ కేసులతో తెగబడుతూ రాద్ధాంతం చేస్తోంది. ఈ క్రమంలో ఏకంగా న్యాయస్థానాలనే తప్పుదారి పట్టించేందుకు బరితెగిస్తోంది. ఆ పక్కా పన్నాగంతోనే... వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా కోర్టును బురిడీ కొట్టించేందుకు హైదరాబాద్‌లో సోదాల పేరుతో శనివారం కొత్త కుట్రకు తెరతీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై నమోదు చేసింది అక్రమ కేసేనని సిట్ దర్యాప్తు తీరే స్పష్టం చేస్తోంది. అందుకనే... టీడీపీ బాస్‌లకు అన్నింట్లోనూ 'ఎస్'అనే పోలీస్ అధికారులతో ఏర్పాటైన సిట్ దర్యాప్తులో ఒక్క ఆధారాన్నీ సేకరించలేకపోయింది. బెదిరింపులు, వేధింపులు, అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు తప్ప సాధించినదేమీ లేదన్నది తేటతెల్లమైంది. ఎల్లో మీడియా ద్వారా సాగిస్తున్న దుష్ప్రచార కుతంత్రమూ బెడిసికొడుతోంది. అసలు లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు పన్నిన పన్నాగం బెడిసి కొడుతుండడంతో చంద్రబాబు ప్రభుత్వం బెంబేలెత్తుతోంది. దర్యాప్తు పేరిట సిట్ చేస్తున్న హడావుడి... ఇదంతా అక్రమ కేసేనని స్పష్టం చేస్తోంది. దీంతో మరో కుతంత్రం రచించింది. హైదరాబాద్‌లో సోదాల డ్రామాను సృష్టించింది.

బాలాజీ గోవిందప్పను అక్రమంగా అరెస్టు చేసి 75 రోజులైంది. ఎలాంటి ఆధారాలు లేకుండా నెలల పాటు దర్యాప్తు రిమాండ్‌లో ఉంచడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. దీంతో బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. బాలాజీ గోవిందప్ప తదితరులకు త్వరలో బెయిల్ ఖాయమని న్యాయ నిపుణులు సైతం స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కేసు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందని సిట్ అధికారులను కోర్టు నిలదీస్తోంది. ఇటీవల సమర్పించిన ప్రాథమిక చార్జ్‌షీట్‌లో బాలాజీ గోవిందప్ప, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తదితరుల పేర్లను ప్రస్తావించలేదు. అందుకని సాంకేతిక అంశాలతో కోర్టును తప్పుదారి పట్టించేందుకు సిట్ కొత్త ఎత్తుగడ వేసింది. ఈ క్రమంలోనే బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకునేందుకు సిట్ పన్నాగం పన్నింది. హఠాత్తుగా సోదాల డ్రామాకు తెరతీసింది. కోర్టు అనుమతి లేకుండానే 20 మందితో కూడిన సిట్ బృందం సోదాలు అంటూ హంగామా చేసింది. సోదాలపై కోర్టు అనుమతి పత్రం చూపించాలన్న వికాట్ ఉద్యోగులతో సిట్ అధికారులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. పోలీస్ మార్క్ గూండాగిరితో భయపెట్టేందుకు ప్రయత్నించారు.

**కుంభకోణం జరిగితేనే కదా?**

లేని కుంభకోణం ఉన్నట్టు చూపించాలన్న సీఎం చంద్రబాబు కుట్ర క్షేత్రస్థాయిలో బెడిసికొడుతోంది. ఈ పరిణామాలన్నీ సిట్ దర్యాప్తు డొల్లతనాన్ని బట్టబయలు చేస్తున్నాయి. దాంతో బాలాజీ గోవిందప్ప బెయిల్ ను అడ్డుకునేందుకు సిట్ సోదాలకు దిగింది. తద్వారా ఈ కేసు ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని చెబుతూ కోర్టును తప్పుదారి పట్టించాలన్నది సిట్ పన్నాగం. ఆ నెపంతో బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను అడ్డుకోవాలన్నది లక్ష్యం.

బాలాజీ గోవిందప్ప డైరెక్టర్‌గా ఉన్న వికాట్ కంపెనీ కార్యాలయంలో సిట్ సోదాలు పక్కా పన్నాగమే. ఎందుకంటే, మే 13న అక్రమంగా అరెస్టు చేసే సమయంలోనూ ఇదే రీతిలో ఆయన నివాసంలో సిట్ అధికారులు రోజంతా సోదాలు చేశారు. ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో బాలాజీ గోవిందప్ప కుమారుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లను జప్తు చేసి సిట్ తన దిగజారుడుతనాన్ని ప్రదర్శించింది. ఆ వస్తువులు తనవి కావని బాలాజీ గోవిందప్ప కోర్టులో పిటిషన్ కూడా వేశారు. సీజ్ చేసిన వస్తువును తిరిగి అప్పగించాలని, సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తామని కోరారు. ఇక ఆయన నివాసంలో గానీ, జప్తు చేసినట్టు ప్రకటించిన ఎలక్ట్రానిక్ పరికరాల్లో గానీ సిట్ ఆధారాలు చూపలేకపోయింది. దాంతో సిట్ పన్నాగం ఫలించలేదు. 75 రోజులు రిమాండ్‌లో ఉన్నా సరే దర్యాప్తులో కనీస పురోగతి సాధించలేదు.

## చెదిరిపోతున్న చంద్రబాబు కుట్రలు

### 3.58 లక్షల జీబీల డేటా ధ్వంసం అంటూ ఈనాడు దుష్ప్రచారం

రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్‌లో 3.58 లక్షల జీబీల డేటాను వైఎస్సార్‌సీపీ వర్గీయులు నాశనం చేశారని... 375 పేజీల డేటాను డిలీట్ చేశారని ఈనాడు సహా ఎల్లో మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. దీనిపై ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద బెవరేజస్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశారు. ''అసలు మా వద్ద అలాంటి డేటానే ఏనాడూ లేదు. మేం ఎలాంటి డేటాను డిలీట్ చేయలేదు''అంటూ స్వయంగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోని బెవరేజస్ కార్పొరేషనే లిఖితపూర్వకంగా తెలిపింది. అంటే, అక్రమ కేసుపై ఎల్లో మీడియా చేస్తున్నదంతా దుష్ప్రచారమేనని నిర్ధారణ అయింది. చంద్రబాబు, లోకేశ్ సిట్‌ను అడ్డుపెట్టుకుని కట్టుకథలు అల్లుతూ... వందల కొద్దీ ఎల్లో యూట్యూబ్ చానళ్లను సృష్టించి, టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులను నిపుణులు, పాత్రికేయులుగా నమ్మిస్తూ భారీగా డబ్బులు ఎరవేసి విష ప్రచారం సాగిస్తున్నారని స్పష్టమైంది.

## హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

- వికాట్, భారతీ సిమెంట్స్ కార్యాలయాల్లో కూడా!
- 2 ప్రత్యేక బృందాలతో ఐదున్నర గంటల పాటు సోదాలు



హైదరాబాద్‌లోని బాలాజీ గోవిందప్ప నివాసంలో సిట్ సోదాలు

**సాక్షి, హైదరాబాద్:** మద్యం అక్రమ కేసులో సిట్ అధికారులు ఏఎస్పీ స్నేహిత నేతృత్వంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వికాట్ గ్రూప్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప నివాసంలో శనివారం సోదాలు నిర్వహించారు. సిట్ గతంలోనూ సుదీర్ఘంగా సోదాలు చేసినా.. ఆయనకు వ్యతిరేకంగా ఒక్క ఆధారమూ కోర్టులో ప్రవేశ పెట్టలేకపోయింది. మరోవైపు ఏసీబీ కోర్టులో బాలాజీ గోవిందప్ప వేసిన బెయిల్ పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుందని, దానిని అడ్డుకునేందుకే సోదాల పేరుతో సిట్ అధికారులు కొత్త నాటకానికి తెరలేపారని గోవిందప్ప న్యాయవాదులు అంటున్నారు. బంజారాహిల్స్‌లోని వికాట్, భారతీ సిమెంట్స్ ప్రధాన కార్యాలయంలోనూ సిట్ సోదాలు నిర్వహించింది. డీఎస్పీ శ్రీనివాస్, ఆరుగురు పోలీసుల బృందంతో కలిసి సుమారు ఐదున్నర గంటలు సోదాల్లో పాల్గొన్నారు. బాలాజీ గోవిందప్ప చాంబర్లు, పరిసర ప్రాంతాలను సోదా చేసినట్లు ఆయన తెలిపారు. కొన్ని డిజిటల్ డివైజ్‌లను సీజ్ చేశామని, వాటిలో ఏముందనేది విచారణలో తేలుస్తామని చెప్పారు. కాగా, సోదాలు నిర్వహించేందుకు వస్తున్నామని సిట్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఎవరు సోదాలు నిర్వహిస్తున్నారనేది బంజారాహిల్స్ ఠాణా రికార్డులో పేర్కొనలేదని తెలిసింది. కేవలం ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులు మాత్రమే... బాలాజీ గోవిందప్ప, భారతీ సిమెంట్స్ కార్యాలయంలో సోదాకు వస్తున్నట్లు రికార్డులో పేర్కొన్నట్లు సమాచారం.

## అప్పుల్లో ఏపీ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించిన నివేదికల ప్రకారం ఏపీపభుత్వం గత మూడు నెలల (2025 ఏప్రిల్, మే, జూన్) కాలంలో రూ.37,093 కోట్ల అప్పులను సేకరించింది. ఏపీతో పోలిస్తే తెలంగాణ ఒకింత తక్కువే అయినా రూ. 20 వేల కోట్ల అప్పుల చిట్టా ను దాటిపోయింది. తెలంగాణతో కొంచెం అటూ ఇటుగా కేరళ, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాలుండగా, మధ్యప్రదేశ్ మాత్రం తెలంగాణ కంటే ఎక్కువగానే అప్పులు తీసుకుంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల పరంగా చూస్తే ఏపీ ఎవరికీ చిక్కనంత దూరంలో నిలిచింది. జాబితాలో ఏపీ తర్వాత తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలున్నాయి.

**2025-26 తొలి త్రైమాసికంలో టాప్-10 రాష్ట్రాల అప్పులు ఇలా... (రూ. కోట్లలో)**

| రాష్ట్రం | ఏడాది లక్ష్యం | తీసుకున్నది |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 79,926.89 | 37,093.98 |
| మధ్యప్రదేశ్ | 78,902.09 | 26,163.94 |
| తెలంగాణ | 54,009.74 | 20,266.09 |
| తమిళనాడు | 1,06,963.22 | 19,377.20 |
| కేరళ | 45,042.54 | 17,888.17 |
| రాజస్తాన్ | 84,643.63 | 17,175.70 |
| పంజాబ్ | 34,201.11 | 9,365.25 |
| ఛత్తీస్‌గఢ్ | 54,004.02 | 3,866.60 |
| గుజరాత్ | 58,397.41 | 3,499.58 |
| కర్ణాటక | 90,428.23 | 3,368.78 |

**సగానికి చేరువగా...!**

వాస్తవానికి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంత మొత్తంలో రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటాయి. ఈ మేరకు వార్షిక బడ్జెట్ అంచనాల్లో ప్రతిపాదించి అసెంబ్లీ ఆమోదం తీసుకుని ఏడాదిపాటు ఆ రుణాలను క్రమంగా తీసుకుంటాయి. కానీ ఏపీ మాత్రం కేవలం మూడు నెలల కాలంలోనే ఏడాది మొత్తం లక్ష్యంగా పెట్టుకున్న అప్పుల్లో దాదాపు సగం అప్పుడే తీసేసుకున్నట్లు కాగ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కల ప్రకారం రూ.79,926.89 కోట్లను 2025-26 ఆర్థిక సంవత్సరంలో అప్పుల పద్దు కింద సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించగా, అందులో 46.40 శాతం అంటే రూ. 37,093.98 కోట్లను అప్పుడే తీసేసుకుంది. ఇక, తెలంగాణ రూ. 54,009.74 కోట్ల రుణ సేకరణ లక్ష్యంగా పెట్టుకుని తొలి మూడు నెలల కాలంలో 37.52 శాతం అంటే రూ. 20,266.09 కోట్లను సమకూర్చుకుంది.

## ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణం

- గతేడాది తొలి త్రైమాసికంతో పోల్చితే మరింత దిగజారుడు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆందోళన



**సాక్షి, అమరావతి:** టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిందంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి త్రైమాసికంతో పోల్చితే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయాలు భారీగా తగ్గాయని ఎత్తిచూపారు. రాష్ట్రంలో అవినీతి విశృంఖలత్వం వల్ల ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోందని మండిపడ్డారు. ప్రతి మంగళవారాన్ని అప్పులవారంగా మార్చుకున్న చంద్రబాబు.. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 15.61 శాతం అధికంగా అప్పులు చేశారంటూ దెప్పి పొడిచారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన కీలకమైన ఆర్థిక సూచీ (ఇండికేటర్)లను ఉటంకిస్తూ చంద్రబాబు సర్కారు ఆర్థిక విధానాలను కడిగిపారేశారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**తగ్గిపోయిన ప్రజల కొనుగోలు శక్తి**

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన నెలవారీ కీలక ఆర్థిక సూచీల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. విభజన అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారి, ఒక సవాలుగా నిల్చింది. సంక్షేమం, అభివృద్ధి.. రెండింటికి ఎప్పుడైతే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి.. ఆ దిశగా వ్యయం చేస్తుందో, అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పెట్టుబడులు కూడా పెరుగుతాయి. ఇది అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది.
- కానీ.. అంతులేని అవినీతి వల్ల రాష్ట్ర ఆదాయం దారుణంగా పడిపోతోంది. మరోవైపు అన్ని రంగాల్లో వృద్ధి పూర్తిగా తిరోగమనం కావడం కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో తొలి 3 నెలలకు సంబంధించి చూస్తే పన్ను, పన్నేతర ఆదాయాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి.
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు కొన్ని విభాగాల్లో అతి తక్కువ వృద్ధి ఉంటే.. మరికొన్ని విభాగాల్లో వృద్ధి తగ్గింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతోందనడానికి నిదర్శనం.
- గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకం పన్నుల ఆదాయం ఏస్థాయిలో తగ్గిందనేది ఇప్పుడు కాగ్ విడుదల చేసిన నివేదిక చూపుతోంది.
- గత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి త్రైమాసికం రాష్ట్ర సొంత ఆదాయంలో కేవలం 3.47 శాతం, ఇతర ఆదాయాలు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14 శాతం వృద్ధి మాత్రమే ఉంది. కానీ, ఇదే సమయంలో రాష్ట్ర అప్పులు ఏకంగా 15.61 శాతం పెరగడం దారుణం. అంటే.. రాష్ట్ర ప్రభుత్వం తన ఖర్చుల కోసం ఆదాయం పెంచుకునే మార్గాలపై కాకుండా, పూర్తిగా అప్పులపైనే ఆధార పడుతోందన్న విషయం స్పష్టమవుతోంది. ఇది ఆందోళనకరంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది.

## బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టుల మృతి
- అధునాతన ఆయుధాల స్వాధీనం

**చర్ల:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం సాయంత్రం మరోమారు తుపాకుల మోత మోగింది. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో.. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. అక్కడ తారసపడిన మావోయిస్టులు భద్రతా బలగాల పైకి కాల్పులు జరిపాయి. భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగడంతో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. కాగా, మృతులను ఇంకా గుర్తించలేదు. సంఘటన స్థలంలో ఇన్‌షాస్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్ తదితర అధునాతన ఆయుధాలు లభించడంతో మృతులు మావోయిస్టు ముఖ్య నేతలుగానే అనుమానిస్తున్నారు. ఘటనాస్థలి నుంచి పలువురు మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలుస్తుండగా.. అక్కడ కూంబింగ్‌ను ముమ్మరం చేసేందుకు అదనపు బలగాలను తరలిస్తున్నారు. కాగా, ఎన్‌కౌంటర్ ఘటనను శనివారం రాత్రి వరకు పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

**జిల్లా వార్తలు**

## గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



నారాయణపురంలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

**సత్తుపల్లిరూరల్:** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించేందుకు జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్ఎల్ఎం) బృందం సత్తుపల్లి మండలంలోని నారాయణపురం, కాకర్లపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు, గ్రామ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఉపాధి హామీ పనులతో లబ్ధి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు అందుతున్న పింఛన్లపై ఆరా తీశారు. అలాగే, గ్రామాల్లో రోడ్ల వెంట నాటిన మొక్కలు, ఫీడర్ ఛానల్ పూడికతీత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కేంద్ర బృందంలో డాక్టర్ గరుడ, ఎస్.అశ్విన్ గోపాల్ తదితరులు ఉండగా, కల్లూరు ఏపీడీ చలపతిరావు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, డీఈ వెంకటేశ్వరరావు, ఏపీఓ బాబురావు, ఏపీఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

## పత్తి, పెసరలో తెగుళ్ల నివారణపై అవగాహన



పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**కొణిజర్ల:** కొణిజర్లలో సాగవుతున్న పత్తి, పెసర పంటలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ పీఎస్ఎం.ఫణిశ్రీ, విజయ తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరుస వర్షాలతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పత్తి చేన్లలో నీరు చేరితే వేరుకుళ్లు తెగులు రానున్నందున కాల్వలు కొట్టి నీరు తొలగించాలని సూచించారు. అలాగే, ఎకరాకు 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ మొక్క సమీపాన చల్లి మట్టి కప్పాలని, నేల ద్వారా తెగుళ్ల వ్యాప్తి చెందకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా యూరియాను నీటిలో వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. అంతేకాక పెసరలో ఆకుపచ్చ తెగులు నివారణకు కాపర్‌ఆక్సీ క్లోరైడ్ లేదా మంకోజెబ్ పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.

## రికార్డు సమయంలో 'ఎత్తిపోతలు'

- త్వరగా పూర్తయిన ప్రాజెక్టుగా మంచుకొండ లిఫ్ట్
- రూ.66 కోట్ల నిధులతో నాలుగు నెలల్లో నిర్మాణం



డెలివరీ పాయింట్ వద్ద అధికారులు, రైతులు, నాయకులు

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని చెరువులకు నీరు సరఫరా చేసి, ఆయకట్టుకు అందించేలా వీ.వీ.పాలెం సాగర్‌ప్రధాన కాల్వలపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం రికార్డు సమయంలో పూర్తయిందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. రూ.66 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును కేవలం నాలుగు నెలల్లోనే పూర్తి చేయడం విశేషం. సాగర్ ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు పైప్‌లైన్ల ద్వారా నీరు చేరుస్తారు. పంప్ హౌస్ నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, మోటార్లు, పంపుసెట్ల ఏర్పాటు వంటి కీలక పనులన్నీ అతి తక్కువ సమయంలో పూర్తయిన ఎత్తిపోతల పథకం రాష్ట్రంలో ఇదే మొదటిదని అధికారులు చెబుతున్నారు. ఇంజనీరింగ్ శాఖ నిపుణులు, జలవనరుల శాఖ అధికారులు, శాఖ రాష్ట్ర సలహాదారుడు పెంటారెడ్డి పర్యవేక్షణలో కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు రాత్రీపగలు తేడా లేకుండా పనులు చేపట్టడంతో ఈ ఫలితం నమోదైందని భావిస్తున్నారు. అంతేకాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పర్యవేక్షిస్తుండడంతో పనులు వేగంగా జరిగాయి. ఇప్పటికే మూడు మోటార్ల ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తవగా.. త్వరలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి మండలంలోని చెరువులకు, ఆపై ఆయకట్టుకు నీరు సరఫరా చేయనున్నారు.

**రైతుల్లో ఆనందం**

రఘునాథపాలెం మండలంలోని చెరువులకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్ జలాలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో ఇన్నాళ్లు వర్షాధారంగానే చెరువులు నిండుతుండగా, సాగుకు ఇబ్బంది ఎదురుకావొద్దని మంచుకొండ వద్ద సాగర్ ప్రధాన కాల్వపై ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఈ పథకంలోని మూడు మోటార్ల ట్రయల్ రన్ విజయవంతం కాగా, డెలివరీ పాయింట్ వద్దకు నీరు చేరుతోంది. ఈమేరకు రైతులు, నాయకులు శనివారం డెలివరీ పాయింట్ వద్ద సంబురాలు చేసుకున్నారు. అంతేకాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పుష్పాభిషేకం చేశారు. అలాగే, పథకాన్ని రికార్డు సమయాన పూర్తిచేయడంలో కీలకంగా వ్యవహరించిన జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం మార్కెట్, ఆత్మ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తాతారావుతో పాటు నాయకులు వాంకుడు దీపక్‌నాయక్, కొంటెముక్క నాగేశ్వరరావు, బాలాజీనాయక్, కేలోత్ దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి రూ.4.32 కోట్లు

**నేలకొండపల్లి:** నేలకొండపల్లి మండలంలోని రాయగూడెం, కొంగర, కట్టుకాచారం, బుద్దారం, అప్పలనరసింహాపురం గ్రామాల ప్రజల అవస్థలకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఏళ్ల తరబడి రాయగూడెం -బుద్దారం మధ్య వాగుపై వంతెన లేకపోవడంతో వరదల సమయాన ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈమేరకు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.32 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, నాగేశ్వరరావు, గోవిందరావు, నంబూరి రామారావు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో కోచ్

**ఖమ్మం స్పోర్ట్స్:** సంగారెడ్డిలో ఈనెల 27వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సీనియర్ కేటగిరీలో పి.పవిత్రాచారి, డి.హర్షిణి, టి.సాయి భవ్యశ్రీ ఎంపిక కాగా, టెక్నికల్ ఆఫీషియల్‌గా జిల్లా వాసి పి.సత్యజిత్‌చారి వ్యవహరించనున్నారు. వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణచారి శనివారం అభినందించారు.

## ఐదుగురికి ఏఎస్సైలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న సీపీ

**ఖమ్మం క్రైం:** ఖమ్మం కమిషనరేట్‌లోని పలు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురికి ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈ జాబితాలో సీహెచ్.నాగేశ్వరరావు, ఎస్.హర్షా, సీహెచ్.చంద్రశేఖర్, బి.కిషన్, ఖాజామొహినుద్దీన్ ఉన్నారు. ఈ సందర్భంగా వీరిని శనివారం సీపీ సునీల్‌దత్ అభినందించారు.

## జాతీయ సదస్సుకు ఖమ్మం జిల్లా ఉపాధ్యాయుడు



ప్రభాకర్‌రెడ్డి

**తిరుమలాయపాలెం:** నూతన జాతీయ విధానంపై ఢిల్లీలో ఈనెల 29న జరగనున్న జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనాల్సిందిగా తిరుమలాయపాలెం జెడ్పీహెచ్ఎస్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించనుండగా, నేషనల్ మిషన్ ఫర్ మెంటారింగ్‌లో సభ్యుడైన ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం పంపించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి విద్యారంగ ప్రముఖులు, విషయ నిపుణులు, నేషనల్ మెంటారింగ్ మిషన్ సభ్యులు పాల్గొని నూతన విద్యావిదానంపై చర్చించనున్నారు. కాగా, జాతీయ సదస్సుకు ఎంపికైన ప్రభాకర్‌రెడ్డిని డీఈఓ సత్యనారాయణ ఏఎంఓ రాజశేఖర్, ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్ఎం విజయకుమారి అభినందించారు.

## భూమి ఆధారంగా యూరియా పంపిణీ

**తల్లాడలో పరిశీలించిన సీపీ సునీల్‌దత్**



గంగదేవిపాడు సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

**తల్లాడ:** తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. గంగదేవిపాడు సొసైటీకి 15 టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో ఎనిమిది గ్రామాల నుంచి పాస్‌బుక్, ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో ఉదయమే చేరుకున్నారు. దీంతో అందరికీ యూరియా సరఫరా చేయాలనే భావనతో ఎకరం భూమి కలిగిన రైతుకు ఒకటి, 5 – 10 ఎకరాలు ఉంటే రెండు బస్తాల చొప్పున పంపిణీకి నిర్ణయించారు. ఈమేరకు ఏఓ ఎం.డీ.తాజుద్దీన్‌తో కూపన్లు జారీచేయించగా పీఏసీఎస్ చైర్మన్ తూము వీరభద్రరావు, అధికారులు పర్యవేక్షించారు.

**రైతులను ఇబ్బంది పెట్టొద్దు...**

**ఖమ్మం వ్యవసాయం/ఖమ్మం రూరల్/తల్లాడ:** వరుస వర్షాలతో పంటల సాగు పెరుగుతుండడంతో యూరియా అవసరం సైతం పెరుగుతోంది. దీంతో చాలాచోట్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు జిల్లా వ్యాప్తంగా గోదాంలు, సొసైటీల్లో తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న స్టాక్, రిజిస్టర్లలో వివరాలను సరిపోల్చడమే కాక రైతులను ఇబ్బంది పెట్టకుండా సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు. కాగా, తల్లాడ మండలం గంగదేవిపాడు, తల్లాడ సొసైటీల వద్ద యూరియా పంపిణీని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. స్టాక్ వివరాలు, ఇంకా అవసరమనే వివరాలు ఆరా తీశారు. అలాగే, ఖమ్మంరూరల్ మండలంలోని చినతండాలోని ఏదులాపురం పీఏసీఎస్ జిల్లా వ్యవసాధికారి ధనసరి పుల్లయ్య సందర్శించారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశాక నిర్వాహకులకు సూచనలు చేశారు. సరిపడా నిల్వలు ఉన్నందున రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. అనంతరం పల్లెగూడెంలోని ఎరువుల షాపుల్లోనూ తనిఖీ చేయగాఏఓ ఉమానగేష్, పీఏసీఎస్ సీఈఓ మహమూద్‌అలీ, ఏఈఓలు పాల్గొన్నారు.

## వ్యాధుల కట్టడిపై దృష్టి సారించండి

**వైద్య, ఆరోగ్య శాఖ ఏడీ అమర్ సింగ్**



వీసీలో మాట్లాడుతున్న ఏడీ అమర్‌సింగ్

**ఖమ్మం వైద్యవిభాగం:** దోమల ద్వారా వచ్చే వ్యాధుల కట్టడిపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ ఆదేశించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఉద్యోగులతో సమీక్షించారు. వర్షాకాలంలో దోమల ద్వారా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందనున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమలు, లార్వా నివారణకు ఫాగింగ్ చేయించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా డెంగీ వ్యాప్తికి అవకాశాలు ఉన్నందున లక్షణాలు కనిపించిన వారికి పరీక్ష చేసి చికిత్స మొదలుపెట్టాలని తెలిపారు. ఈ వీసీలో డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి, ప్రోగ్రాం అధికారులు వెంకట రమణ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 18.60 అడుగులకు చేరిన పాలేరు



వరదను ఏటిలోకి మళ్లించేలా కాల్వ తవ్వుతున్న యంత్రాలు

**కూసుమంచి:** మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం శనివారం సాయంత్రానికి 18.60 అడుగులకు చేరింది. సాగర్ నుండి 3,965 క్యూసెక్కుల నీటి సరఫరా కొనసాగుతుండగా మరో 100 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం చేరుతోంది. ఇదే సమయాన రిజర్వాయర్ నుంచి దిగువకు 1,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే, ఔట్ ఫ్లో కన్నా ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో రెండు రోజుల్లో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టమైన 23 అడుగులకు చేరనుంది. కాగా, పాలేరు రిజర్వాయర్ సమీపాన ఎడమ కాల్వకు కొత్తగా యూటీ(అండర్ టన్నెల్) నిర్మాణం పూర్తికావడంతో ఎగువన ఉన్న పొలాల మీదుగా వచ్చే వరదను యూటీ ద్వారా సమీపంలోకి ఏటికి మళ్లించారు.